
పథకాలకు దరఖాస్తు చేసుకునేందుకు వేచి ఉన్న ప్రజలు


భగత్‌సింగ్‌నగర్ మోడ్రన్ కల్యాణ మండపం వద్ద..


దీపోచంపల్లి 120 గజాల్లో దరఖాస్తు చేసుకునేందుకు వేచి ఉన్న జనం

రెండో రోజు అదే స్పందన

రంగారెడ్డినగర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోంది. ఆయా ప్రాంతాల్లోని వార్డు కార్యాలయాల్లో అందుబాటులో ఉంచిన కేంద్రాలకు పెద్ద సంఖ్యలో తరలి వస్తున్న ప్రజలకు దరఖాస్తులు అందజేస్తూ వాటిని ఎలా పూరించాలన్న విషయంలో సిబ్బంది అవగాహన కల్పిస్తున్నారు. సంబంధిత నోడల్ అధికారులు, టీమ్ లీడర్లు కేంద్రాల్లో దరఖాస్తుల స్వీకరణను పర్యవేక్షిస్తున్నారు.

ప్రతిరోజు దరఖాస్తుల స్వీకరణ

కుత్బుల్లాపూర్: ప్రతిరోజు ఆయా ప్రాంతాల్లో దరఖాస్తుల స్వీకరణ ఉంటుందన్నారు. ఒకరోజు ముందుగానే తాము కమ్యూనిటీ ఆర్గనైజర్లతో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. జంట సర్కిళ్ల పరిధిలో జరుగుతున్న దరఖాస్తుల స్వీకరణలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ఉప కమిషనర్లు నాగమణి, మల్లయ్య ఎప్పటికప్పుడు సిబ్బందితో మాట్లాడుతూ ఆయా కేంద్రాలను సందర్శించారు. దరఖాస్తు చేసేందుకు వచ్చిన వారు పేర్కొన్న పలు సమస్యలను అక్కడికక్కడే పరిష్కరిస్తూ ముందుకు సాగారు.

దరఖాస్తులు అందడం లేదని కొందరు..

దరఖాస్తులు ఎప్పుడు తీసుకుంటారని మరికొందు!

కుత్బుల్లాపూర్: దరఖాస్తులు అందడం లేదని కొందరు... మా కాలనీ దరఖాస్తులు ఎప్పుడు తీసుకుంటారని మరికొందరు.. జిరాక్స్ దుకాణాల వద్ద దోపిడీ చేస్తున్నారని.. అధికారులు స్పందించి దరఖాస్తులను పంపిణీ చేయాలని ఆయా కేంద్రాల వద్ద ప్రజలు అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాపోతున్నారు. కుత్బుల్లాపూర్ గాజుల రామారం జంట సర్కిళ్ల పరిధిలో మొత్తం 32 కేంద్రాల వద్ద రెండో రోజు ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం చేపట్టారు.

రేషన్‌కార్డు లేకున్నా దరఖాస్తు చేసుకోవచ్చు...

కుత్బుల్లాపూర్: రేషన్‌కార్డు ఇప్పటి వరకు లేనివారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. రేషన్ కార్డు ఉంటే కార్డు నంబర్ రాయాలని అధికారులు పేర్కొన్నారు. ఆరు పథకాలకు సంబంధించిన పూర్తిగా నింపి ఆయా కేంద్రాల్లో అందజేస్తే ఇంటికి విచారణ నిమిత్తం వచ్చే అధికారులకు పూర్తి ఆధారాలను అందజేయాలన్నారు. ప్రస్తుతం దరఖాస్తులు మాత్రమే ఇవ్వాలని కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ మమత సూచించారు. ప్రజలు అధికారుల సూచనలను పాటించాలని కోరారు.


దరఖాస్తు కేంద్రం వద్ద భారీ క్యూ లైన్

రెండు సర్కిళ్లలో 29,438 దరఖాస్తుల స్వీకరణ

కుత్బుల్లాపూర్: ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పథకాల లబ్ధి పొందేందుకు దరఖాస్తుదారులు కుత్బుల్లాపూర్, గాజులరామారం సర్కిళ్ల పరిధిలోని కేంద్రాలకు పోటెత్తుతున్నారు. రెండోరోజు పెద్ద సంఖ్యలో జనం దరఖాస్తులను పూరించి ఫారాలను సంబంధిత అధికారులకు అందజేశారు.

- గాజులరామారం సర్కిల్ పరిధిలోని గాజులరామారం డివిజన్‌లో 4491, జగద్గిరి గుట్టలో 4605, చింతల్ డివిజన్‌లో 2972, సూరారం డివిజన్‌లో 3820 మొత్తం 15,888 దరఖాస్తులు అందినట్లు సర్కిల్ అధికారులు తెలిపారు.
- కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని రంగారెడ్డినగర్ డివిజన్‌లో 2983 దరఖాస్తులు, సుభాష్‌నగర్ డివిజన్‌లో 5385, కుత్బుల్లాపూర్ డివిజన్‌లో 2941, జీడిమెట్ల డివిజన్‌లో 2241 మొత్తం 13, 550 దరఖాస్తులు అందినట్లు అధికారులు పేర్కొన్నారు.


షాపూర్‌నగర్‌లోని ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కేంద్రం వద్ద తాగునీటి ఏర్పాట్లను పరిశీలిస్తున్న జలమండలి డీజీఎం అప్పల నాయుడు

నేడు ఈ ప్రాంతాల నుంచి దరఖాస్తు స్వీకరణ కేంద్రాలు ఇవే..

కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలో..

రంగారెడ్డినగర్ డివిజన్..

- గాంధీనగర్ కమిటీహాల్‌లో నందానగర్, గురుమూర్తినగర్ కమిటీహాల్‌లో గిరినగర్, ఆదర్శనగర్ కమిటీహాల్‌లో ఆదర్శనగర్, రంగారెడ్డినగర్ సెయింట్ ఇషాక్ స్కూల్‌లో పంచశీలకాలనీ.

సుభాష్‌నగర్ డివిజన్..

- సుభాష్‌నగర్ వార్డు కార్యాలయంలో హమీద్‌బస్తీ, ఎస్ఆర్ నాయక్ నగర్ కమిటీ హాల్‌లో భగత్‌సింగ్‌నగర్, అపురూపా కాలనీ కమిటీహాల్‌లో ఎస్ఆర్ నాయక్ నగర్, సూరారం లూయిా బ్రెయిలీ భవనంలో సుందర్‌నగర్.

కుత్బుల్లాపూర్ డివిజన్..

- పద్మనగర్ ఫేజ్–2 కమిటీహాల్‌లో శ్రీనివాస్‌నగర్, ఎన్టీఆర్ నగర్, మాణిక్యనగర్ కమిటీహాల్‌లో ఇంద్రసింగ్‌నగర్, వెంకటేశ్వరనగర్, వాణినగర్ వినాయక మండపంలో వాజ్‌పేయినగర్, కల్పన సొసైటీ హాలులో రామిరెడ్డినగర్..

జీడిమెట డివిజన్..

- ప్రసూననగర్ కమిటీహాల్‌లో వెంకటేశ్వరనగర్, దుర్గా ఎస్టేట్స్ కమిటీహాల్‌లో ఎం.ఎస్.రెడ్డి నగర్, కుత్బుల్లాపూర్ గ్రామం సీనియర్ సిటిజెన్స్ భవనంలో వినాయక్‌నగర్, గాయత్రినగర్ వార్డు కార్యాలయంలో ప్రాగా టూల్స్ కాలనీ..

గాజులరామారం సర్కిల్ పరిధిలో..

గాజులరామారం డివిజన్..

- గాజులరామారం వార్డు కార్యాలయంలో ద్వారకానగర్, ఉషోదయ కాలనీ కమిటీహాల్‌లో వీనస్ ఎన్‌క్లేవ్, దేవేందర్‌నగర్ కమిటీహాల్‌లో ఆర్‌వీఎన్ఆర్ నగర్,సుభాష్‌చంద్రబోస్ కమిటీహాల్‌లో సుభాష్‌చంద్రబోస్‌నగర్..

జగద్గిరిగుట్ట డివిజన్..

- జగద్గిరిగుట్ట వార్డు కార్యాలయంలో రాజీవ్‌గృహకల్ప, దేవమ్మబస్తీ గణేష్ మండపంలో పాపిరెడ్డినగర్, మగ్దూమ్‌నగర్ సాయిబాబా కల్యాణ మండపంలో మైసమ్మనగర్ బ్లాక్–బి, జగద్గిరినగర్ కమిటీహాల్‌లో మగ్దూమ్‌నగర్..

చింతల్ డివిజన్..

- చింతల్ వార్డు కార్యాలయంలో భగత్‌సింగ్‌నగర్, ఎన్ఎల్‌బీనగర్ కమిటీహాల్‌లో ఎన్ఎల్‌బీ నగర్, శ్రీనివాసనగర్ కమిటీహాల్‌లో వల్లభాయ్ పటేల్‌నగర్, చింతల్ కాశీనాథ్ కల్యాణ మండపంలో దుర్గయ్యనగర్..

సూరారం డివిజన్..

- నెహ్రూనగర్ వార్డు కార్యాలయంలో హెచ్ఏఎల్ కాలనీ, రాజీవ్‌గాంధీనగర్ కమిటీహాల్‌లో రాజీవ్‌గాంధీనగర్, సూరారం అంబేడ్కర్ భవన్‌లో హనుమాన్‌నగర్, సంజయ్‌గాంధీనగర్ కమిటీ హాల్‌లో న్యూషాపూర్‌నగర్.



ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న సిబ్బంది

లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

గచ్చిబౌలి: డ్రంకన్ డ్రైవ్‌లో, డ్రైవింగ్ లైసెన్స్ కేసులు పెండింగ్‌లో ఉన్నవారు లోక్‌అదాలత్‌లను సద్వినియోగం చేసుకోవాలని గచ్చిబౌలి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్, రాయదుర్గం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్ కోరారు. శనివారం కూకట్‌పల్లి కోర్టులో నిర్వహించే లోక్‌అదాలత్‌లో హాజరైతే కేవలం జరిమానాతో క్లోజ్ చేస్తారని వారు సూచించారు డ్రంకెన్ డ్రైవ్ కేసులు ఉన్నవారు వారి ఆధార్‌కార్డు జిరాక్స్, లైసెన్స్, వెహికిల్ ఆర్‌సీలను,... డ్రైవింగ్ లైసెన్స్ కేసులు ఉన్నవారు ఆధార్ కార్డు, వెహికిల్ ఆర్‌సీ జిరాక్స్ తీసుకొని వచ్చి తమ కేసులను క్లోజ్ చేయించుకోవాలని వారు సూచించారు.

'సండే ఈవినింగ్ టాక్'

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఆదివారం ప్రత్యేక 'సండే ఈవినింగ్ టాక్' కార్యక్రమం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. 'లెట్స్ గో, మూవ్ ఆన్ అండ్ క్రియేట్ యువర్ న్యూఇయర్' అనే అంశంపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తారు. కార్యక్రమాలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

జనవరి 19 నుంచి చిత్తారమ్మ జాతర


ఫైల్ ఫొటో

సుభాష్‌నగర్: నగరంలో ఉజ్జయిని మహంకాళి జాతర తర్వాత రెండో అతిపెద్ద జాతరగా గాజులరామారంలోని చిత్తారమ్మ దేవి జాతర అని చెప్పుకోవచ్చు. ప్రతి ఏటా జనవరి నెలలో సంక్రాంతి పండుగ తర్వాత తొమ్మిది రోజుల పాటు జాతర జరుగుతుంది. ఈ జాతరకు స్థానికంగానే కాకుండా చుట్టుపక్కల జిల్లాల నుంచి వేలాదిమంది భక్తులు తరలివస్తారు. ఇక ప్రధాన జాతర రోజు ఉదయం నుండి రాత్రి వరకు ఇసుకేస్తే రాలనంత రద్దీ ఉంటుంది. అమ్మవారి ఆలయానికి పెట్టి చూసిన అర కిలోమీటర్ మేర భక్తులు గుడారాలు వేసుకుంటారు. ఇక గ్రామ ప్రజలతో పాటు వచ్చే భక్తులు పెద్ద ఎత్తున బోనాలు సమర్పిస్తుంటారు. దీంతో ఆ తొమ్మిది రోజుల పాటు అక్కడ పల్లెటూరి వాతావరణం ఏర్పడుతుంది.

- ఈ ఏటా జరగనున్న అమ్మవారి జాతర కార్యక్రమాల తేదీలను ఆలయ కమిటీ ప్రకటించింది. జనవరి 19 నుండి 27 వరకు ఈ జాతర కొనసాగుతుందని, ప్రధాన జాతర జనవరి 21 ఆదివారం జరగనుందని ఆలయ కమిటీ చైర్మన్ కూన అంతయ్యాగౌడ్ తెలిపారు.

తొమ్మిది రోజుల జాతర కార్యక్రమాలు...

జనవరి 19న గణపతి పూజ, పుణ్యా వచనము, పంచగవ్య ప్రాశన, దీక్షాదారణ, మంటపారాధన, అగ్ని ప్రతిష్ఠాపన. 20 న గవంత పూజలు, మూల మంత్ర జపము, చండీ హోమం, పూర్ణాహుతి, బలి ప్రధానం. 21న ప్రధాన జాతర లో భాగంగా ఉదయం 3గంటలకు అభిషేకం, 4గంటలకు విజయ దర్శనం, ఒడి బియ్యం, 11 గంటలకు బోనాలు, మూడు గంటలకు ఊరేగింపు, పోతరాజుల నత్యం, వినోద కార్యక్రమాలు. 22న రంగం దివ్యవాణి. 23 24 25 26 లో కుంకుమార్చనలు. 27న ఉదయం 11 గంటల నుంచి అన్నదాన కార్యక్రమంతో జాతర ముగియనుంది.

ఏర్పాట్లు ప్రారంభించాం..



అత్యంత వైభవంగా జరిగే చిత్తారమ్మ దేవి జాతరకు ఆలయాన్ని ముస్తాబు చేస్తున్నాం. భక్తులకు అసౌకర్యాలు కలగకుండా వారం రోజుల నుంచి ఆలయ పరిసరాల్లో పనులు ప్రారంభించాం. అమ్మవారి జాతరకు పెరుగుతున్న భక్తుల రద్దీ దృష్ట్యా భారీ ఏర్పాట్లు చేస్తున్నాం.

– కూన అంతయ్యాగౌడ్, ఆలయ చైర్మన్

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించొద్దు

- వాహనాలను రోడ్లపై పార్కింగ్ చేయొద్దు
- అల్వాల్ ట్రాఫిక్ పోలీసులు

కుత్బుల్లాపూర్: రోడ్డు పక్కన వాహనాలు నిలిపి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించేలా వ్యవహరిస్తున్న పలు వాహనాలకు అల్వాల్ ట్రాఫిక్ పోలీసులు చలాన్లు విధించారు. ఒక పక్క జాతీయ రహదారి వెడల్పు పనులు జరుగుతుండగా మరోపక్క తీవ్రంగా ట్రాఫిక్ సమస్య ఎదురవుతూ వస్తోంది. ఈ నేపథ్యంలో కొంతమంది తమ వాహనాలను రోడ్డు పక్కనే నిలిపి షాపింగ్ ఇతరత్రా పనులకు వెళ్లడం మూలంగా ట్రాఫిక్ సమస్య పెద్ద సవాల్‌గా మారింది. పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ నుంచి అంగడిపేట వరకు ఇటీవల సర్వీస్ రోడ్డు మీదుగా జాతీయ రహదారిపై వెళ్లే వాహనాలను దారి మళ్లించి పంపిస్తున్నారు. ఈ క్రమంలో రోడ్డుపక్కనే వాహనాలు నిలిపితే వారిపై చర్యలకు ఉపక్రమించి చలాన్ విధిస్తున్నారు. వాహనదారులు సహకరించాలని పోలీసులు కోరుతున్నారు.


సుచిత్ర సమీపంలో వాహనాలు నిలపకుండా విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది

ప్రమాదకరంగా ఓవర్ హెడ్ ట్యాంక్

దుకాణదారులు కోర్టుకు వెళ్లడంతో నిలిచిన కూల్చివేత పనులు

రంగారెడ్డినగర్: శిథిలావస్థకు చేరిన ఉపయోగంలో లేని ఓవర్ హెడ్ ట్యాంక్ ప్రమాదకరంగా మారింది. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని ఐలా కార్యాలయం సమీపంలో ఐడీపీఎల్–జగద్గిరిగుట్ట రోడ్డును ఆనుకుని ఉన్న స్థలంలో ఐలా ఆధ్వర్యంలో స్థానిక నీటి అవసరాలను తీర్చేందుకు ట్యాంక్‌ను ఏర్పాటు చేశారు. అయితే పారిశ్రామికవాడను ఆనుకుని బస్తీలు వెలియడంతో పాటు కంపెనీలను నేరుగా జలమండలి పైపులైన్‌ల ద్వారా నీటి సరఫరా కావడంతో ఓవర్ హెడ్ ట్యాంక్ వినియోగం తగ్గిపోతూ వచ్చింది.

- ఈ క్రమంలో ట్యాంక్ నిర్వహణ లోపించడంతో పెచ్చులూడి శిథిలావస్థకు చేరుకుంది. ట్యాంక్ ప్రమాదకరంగా మారడంతో ఐలా అధికారులు కూల్చేందుకు సిద్ధపడగా చుట్టు పక్కల దుకాణదారులు అడ్డు తగిలి కోర్టుకు వెళ్లారు. దీంతో శిథిలావస్థకు చేరుకున్న ట్యాంక్ అలాగే ప్రమాదకరంగా ఉంది. ఇటీవల ట్యాంక్ ముందు రోడ్డుకు ఆనుకుని ఓ వ్యక్తి స్థలాన్ని కొనుగోలు చేసి చదును చేశాడు. అయితే ట్యాంక్ కూల్చకుండా నిర్మాణం చేపడితే భవిష్యత్‌లో భవనంపై కూలే అవకాశముందని పలువురు పేర్కొంటున్నారు.


ఐలా కార్యాలయం వద్ద శిథిలావస్థకు చేరుకున్న ఓవర్ హెడ్ ట్యాంక్

రేపు డ్రంకన్ డ్రైవ్

ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్

హఫీజ్‌పేట్ : మద్యం తాగి వాహనాలతో రోడ్లపైకి రావద్దని చందానగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 31వ తేదీ నూతన సంవత్సర వేడుకల సందర్భంగా సైబరాబాద్ కమిషనర్ ఆదేశాల మేరకు ఆదివారం రాత్రి 8 గంటల నుంచి తెల్లవారు జామున 3 గంటల వరకు ప్రత్యేక టీంలతో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మద్యం సేవించే వారు వాహనాలు నడపవద్దని హెచ్చరించారు.

భారతీయ సంస్కృతిని ప్రపంచానికి చాటి చెప్పాలి

భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

రాయదుర్గం: శాస్త్రీయ నృత్యకళలు, భారతీయ సంస్కృతిని ప్రపంచానికి మరింతగా చాటి చెప్పాల్సిన అవసరం ఉందని భారత మాజీ ఉపరాష్ట్రపతి ఎం వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి డాక్టర్ రామినేని ఫౌండేషన్ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గ్లోబల్ పీస్ ఆడిటోరియంలో శ్రీద వరాళి చదలవాడ కూచిపూడి రంగప్రవేశం ఆద్యంతం అందరినీ ఆకట్టుకునేలా సాగింది. వినాయకనిను విన అంటూ నర్తకి తొలి నాట్య ప్రదర్శన అందరినీ విశేషంగా ఆకట్టుకుంది. వెంకయ్యనాయుడు నృత్యప్రదర్శనను తిలకించి ఆమెను ఆశీర్వదించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శాస్త్రీయ నృత్యాలైన కూచిపూడి, భరతనాట్యం, ఒడిస్సీ తదితరాలను మనం కాపాడుకోవాలని, మన పిల్లలకు నేర్పించే బాధ్యతను తల్లిదండ్రులు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీ రఘురామకృష్ణంరాజు, రామినేని ఫౌండేషన్ చైర్మన్ ధర్మప్రచారక్ రామినేని, డీఆర్‌డీఓ మాజీ చైర్మన్ డాక్టర్ సతీష్‌రెడ్డి, సినీ దర్శకులు రాఘవేంద్రరావు, మాజీ కేంద్ర విజిలెన్స్ కమిషనర్ కేవిచౌదరి, సినీ నృత్య దర్శకులు కెవి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండో పోటీలకు ఒయాసిస్ స్కూల్ బాలికలు

రాయదుర్గం: తైక్వాండో జాతీయస్థాయి పోటీలకు రాయదుర్గంలోని ఒయాసిస్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ బాలికలు ఎంపికయ్యారు. స్కూల్‌లో పదవ తరగతి చదివే ఆధ్యామేఘన అండర్–17 బాలికల విభాగంలో బంగారు పతకం, ఆరవ తరగతి చదివే సమన్విత అండర్–14 బాలికల విభాగం తైక్వాండో రాష్ట్ర స్థాయి పోటీలో బంగారు పతకాలను సాధించారు. వీరు వికారాబాద్ జిల్లా తాండూరులో జరిగిన పోటీలలో పాల్గొన్నారు. రాష్ట్ర స్థాయిలో బంగారు పతకాలు సాధించడంతో వారిద్దరిని జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. 67వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ స్థాయి పోటీలను మధ్యప్రదేశ్ రాష్ట్రం బేతుల్‌లో డిసెంబర్ 31 నుంచి జనవరి 5వ తేదీ వరకు ఈ పోటీలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

న్యూఇయర్ వేడుకల్లో హద్దు మీరితే చర్యలు తప్పవు


మాట్లాడుతున్న బాలానగర్ ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు

సుభాష్‌నగర్: డిసెంబర్ 31 నూతన సంవత్సర వేడుకల్లో వాహనదారులు హద్దు మీరితే చర్యలు తప్పవని బాలానగర్ ట్రాఫిక్ ఏసీపీ ఎస్. శ్రీనివాసులు హెచ్చరించారు. జీడిమెట్ల ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఆవరణలో శుక్రవారం స్థానిక సీఐ వెంకటరెడ్డితో కలిసి ఏసీపీ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ... న్యూ ఇయర్ వేడుకల సందర్భంగా డిసెంబర్ 31న బాలానగర్ ట్రాఫిక్ డివిజన్ పరిధిలోని నెహ్రూ ఔటర్ రింగ్ రోడ్డుపై మల్లంపేట్, శంభీపూర్, దుండిగల్ ఎగ్జిట్‌లలో రాత్రి 10 నుంచి జనవరి 1వ తేదీ ఉదయం 5గంటల వరకు విమానాశ్రయానికి వెళ్లే వాహనాలు తప్ప మరే ఇతర వాహనాలకు అనుమతించేది లేదని తెలిపారు. డివిజన్ పరిధిలోని ఎర్రగడ్డ నుంచి మూసాపేట్ అంబేడ్కర్ వై జంక్షన్, కూకట్‌పల్లి వరకు, బాలానగర్ నుంచి గాగిల్లాపూర్, అల్విన్ కాలనీ నుంచి బాలనగర్, ఉల్లాస్ దాబా మియాపూర్ నుంచి ఎంఆర్ఐటీ కాలేజీ వరకు అన్ని దారుల్లో ట్రాఫిక్ సిబ్బంది, సీసీ టీవీ ఫుటేజీల నిఘా ఉంటుందని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే ఎంతటి వారినైనా ఊరుకునేది లేదన్నారు. వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. యువత మద్యం సేవించి రోడ్లపై రాష్ డ్రైవింగ్, రోడ్లపై కేక్ కటింగ్, డాన్సులు, గుంపులు, గుంపులుగా తిరిగే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

భక్తిశ్రద్ధలతో మహా పడిపూజ


మహా పడిపూజలో పాల్గొన్న బీజేపీ నేత భరతసింహారెడ్డి

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ డివిజన్ పద్మానగర్ ఫేజ్–2 రింగ్‌రోడ్‌సమీపంలో శుక్రవారం దేవరకొండ శ్రీనివాస్ గురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప మహాపడి పూజా కార్యక్రమం వైభవోపేతంగా జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన భజనలు, ప్రత్యేక పూజల్లో బీజేపీ మేడ్చల్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరతసింహారెడ్డి పాల్గొన్నారు.

భార్య నిలదీసిందని యువకుడి ఆత్మహత్య

సుభాష్‌నగర్: హిజ్రాతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నందుకు భార్య నిలదీయడంతో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.. సీఐ వెంకటేశ్వర్లు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, పల్నాడు జిల్లా కాసర్లపాడు గ్రామానికి చెందిన బానోత్ నాగదుర్గనాయక్ (22) సూరారం మల్లారెడ్డి హాస్పిటల్‌లో వార్డు బాయ్‌గా పని చేస్తున్నాడు. అతనికి నెల రోజుల క్రితం వివాహం కాగా భార్యతో కలిసి సూరారం దయానంద్‌నగర్‌లో కాపురం పెట్టాడు. అయితే అతను నాలుగేళ్లుగా ముత్తయ్యనగర్‌కు చెందిన హిజ్రాతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. ఈ విషయం తెలియడంతో భార్య అతడిని నిలదీసింది. దీంతో మనస్తాపానికి లోనైన దుర్గనాయక్ భార్యను స్వగ్రామానికి వెళ్లమని చెప్పి నేరుగా హిజ్రా ఇంటికి వెళ్లాడు. అనంతరం హిజ్రాను బాలానగర్‌కు పంపించి ఇంట్లో ఒంటరిగా ఉన్న అతను రాత్రి ఆమెకు వీడియోకాల్ చేసి ఉరేసుకుని చనిపోతున్నట్లు చెప్పాడు. ఆమె ఇంటికి తిరిగివచ్చేలోగా ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్నికల ఖర్చు లెక్కలు వెంటనే ఇవ్వండి

సాక్షి, మేడ్చల్ జిల్లా: అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థుల ఎన్నికల ఖర్చు వివరాలను రీకన్సిలేషన్ చేసి కేంద్ర ఎన్నికల కమిషన్‌కు సమర్పించడం జరుగుతుందని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాకు నియమించబడిన కేంద్ర ఎన్నికల వ్యయ పరిశీలకులు ప్రేమ్ ప్రకాష్ మీనా, నాగ్వీ బలాసాహెబ్ బాపురావు అన్నారు. శుక్రవారం జిల్లా సహకార అధికారి, జిల్లా ఎన్నికల వ్యయ నోడల్ అధికారి ఆర్. శ్రీనివాసమూర్తితో కలిసి కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో గత అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు, ప్రతినిధులతో సమావేశమై ఎన్నికల ఖర్చుల వివరాలను పరిశీలించారు. అభ్యర్థులు ఎన్నికల వ్యయాన్ని వారు నామినేషన్ వేసిన నాటి నుంచి ఎన్నికల ఫలితాలు ప్రకటించిన వరకు చేసిన ఖర్చు వివరాలను 30 రోజుల్లో సమర్పించాలన్నారు. ఈ వివరాలను మరోమారు పరిశీలించి కేంద్ర ఎన్నికల కమిషన్‌కు సమర్పించడం జరుగుతుందని తెలిపారు. అభ్యర్థులు తమ పూర్తి ఖర్చుల వివరాలను అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లాలోని ఐదు నియోజకవర్గాల అసిస్టెంట్ ఎన్నికల వ్యయ పరిశీలకులు నాగేశ్వరరావు, శ్రీనివాస్ రాజు, ఆంజనేయులు, రామచంద్ర, రవి పాల్గొన్నారు.

మాస్టర్ అథ్లెటిక్ పోటీల్లో సత్తా చాటాలి

హఫీజ్‌పేట్ : రాష్ట్రస్థాయి మాస్టర్ అథ్లెటిక్ పోటీల్లో రంగారెడ్డి మాస్టర్ అథ్లెట్ సత్తా చాటాలని మాస్టర్ అసోసియేషన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కొండ విజయ్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం చందానగర్ పీజేఆర్ స్టేడియంలో నిర్వహించిన మాస్టర్స్ ఎంపిక కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ నెల 30,31వ తేదీలలో గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే రంగారెడ్డి జిల్లా టీం సభ్యుల ఎంపికతో పాటు ఎంపికైన వారికి ట్రాక్ సూట్లను కార్యదర్శి సురేందర్, ట్రెజరర్‌లతో కలిసి ఆయన అందజేశారు.